

గజ్వేల్ అర్బన్ : మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

# హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఏడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని మున్సిపల్ పాలకవర్గం సభ్యులు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రహీం, రజిత, బాలమణిశ్రీనివాస్‌రెడ్డి, అర్చనాశివకుమార్, బాలేష్, భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, చందు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమాగోపాల్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 5 : పట్టణంలోని పలు వార్డుల్లో రూ.25 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించాయి. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లను పిలిచేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. హుస్నాబాద్ పర్యటన సందర్భంగా అప్పటి పురపాలకశాఖ మాజీ మంత్రి కేటీఆర్ టీయూఎఫ్ఐడీసీ కింద రూ.25 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పట్టణంలోని ఎలాంటి పనులు నిర్వహించాలనే విషయంపై ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులు, పార్కు, టౌన్ హాల్, అప్రోచ్ రోడ్లు, ఎల్లమ్మ చెరువుకట్ట నుంచి పందిల్ల రోడ్ వరకు బీటీ రోడ్ నిర్మాణంతోపాటు పలు పనులు చేపట్టేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపగా, ఉన్నతాధికారులు సైతం ఆమోదం తెలిపారు. ఈ నిధులతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే, ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

## 7న 'మల్లన్న' హుండీ లెక్కింపు

చేర్యాల, డిసెంబర్ 5 : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో డిసెంబర్ 7న హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారికి మొక్కుల రూపంలో చెల్లించుకున్న నగదు, బంగారం, వెండి కానుకలు లెక్కించనున్నారని, బియ్యం, పసుపును తూకం వేయనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపునకు పాలక మండలి, పోలీస్, రెవెన్యూ అధికారులు, బ్యాంకు అధికారులతో పాటు ఆహ్వానం అందుకున్న ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## వర్షానికి తడిసిన ధాన్యం

గజ్వేల్, డిసెంబర్ 5 : తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షానికి రోడ్లపై రైతులు ఆరబెట్టిన ధాన్యం తడుస్తున్నది. గజ్వేల్ సమీపంలోని ధర్మారెడ్డిపల్లి, మూట్రాజ్‌పల్లి రింగ్ రోడ్డుపై ధాన్యం తడిసింది. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న ముసురుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతలు ఇంకా పూర్తి కాకపోవడంతో పంట నష్టం జరిగే అవకాశం ఉంది.

**కోహెడలో ఈదురుగాలులతో కూడిన వర్షం..**

కోహెడ, డిసెంబర్ 5 : మిచౌంగ్ తుఫాన్ మంగళవారం బాపట్ల తీరం దాటడంతో మండలంలో వర్షం కురిసింది. ఆకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం ఆరబోసిన రైతులు ఇబ్బంది పడ్డారు. చలిగాలులు వీయడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఇండ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా మారడంతో దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఆత్మ కమిటీ పాలకవర్గం రాజీనామా

గజ్వేల్, డిసెంబర్ 5 : గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు తమ పదవులకు మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం డీఏవో బాబు నాయక్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవిస్తూ తమ పదవులకు రాజీనామా చేశామని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తమకు పదవులు ఇవ్వడంతో రైతులకు సేవ చేసుకునే భాగ్యం దక్కిందన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సంపత్, హన్మంతు, రజినీకాంత్, భాస్కర్, వెంకటేశం పాల్గొన్నారు.



ఆత్మ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్న కృష్ణారెడ్డి

# అసత్య ప్రచారాలు మానుకోవాలి

**బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం**

చేర్యాల, డిసెంబర్ 5 : బీఆర్‌ఎస్ తరపున నూతనంగా గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ మారుతున్నట్లు కొన్ని దుష్టశక్తులు ప్రచారం చేయడం హేయనీయమన్నారు. వెంటనే అసత్య ప్రచారాలు మానుకోవాలని, లేదంటే బీఆర్‌ఎస్ శ్రేణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ


కోహెడ, డిసెంబర్ 5 : మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బండారి బాలరాజు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు జాగిరి యాదగిరి, చాడ నర్సింహారెడ్డి, బండారి రాజయ్య, బండారి రవీందర్ ఉన్నారు.

**కార్యకర్త కుటుంబానికి పరామర్శ..**

కొండపాక(కుకునూరుపల్లి), 5 : కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కామల్ల బీరప్ప తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చంద్రం, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు సంతోష్‌చారి తదితరులు ఉన్నారు.

**స్నేహితుడి కుటుంబానికి చేయూత..**

మిరుదొడ్డి, డిసెంబర్ 5 : మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాళ్లబండ నరసింహాచారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.23,500 వేల నగదు, క్వింటాల్ బియ్యం అందజేశారు. పరామర్శించిన వారిలో స్నేహితులు కండ్లకొయ్య యాదగిరి, వేముల శ్రీనివాస్, మాధుసూదన్‌రెడ్డి, పాపగారి రాజమల్లు, మర్కంటి ఉమాపతి, గరిపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



కోహెడ : మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కర్ర శ్రీహరి



కొండపాక : బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న దేవీ రవీందర్

## నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

బెజ్జంకి, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## జనగామ జడ్పీ చైర్మన్ మృతికి సంతాపం

చేర్యాల, డిసెంబర్ 5 : జనగామ జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, మేక సంతోష్, మంద యాదగిరి, చేర్యాల టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తిలో జడ్పీ చైర్మన్ విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. సంపత్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న నాయకులు



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 5 : ధూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికలకు ముందు జనగామ ఎమ్మెల్యేగా డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడతామని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కుకున్నారు. జనగామ ఎమ్మెల్యేగా పల్లా గెలుపొందడంతో మంగళవారం ఆంజనేయస్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాంపల్లి నరహరి, రచ్చ గణేశ్, తాళ్లపల్లి ప్రభాకర్, చొప్పరి రాజు, మదాసు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 5 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థి ఆగస్టిన్ హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో జరిగే జాతీయ స్థాయి అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈనెల 23 నుంచి జనవరి 1 వరకు నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు విద్యార్థి హాజరుకానున్నాడు. కళాశాల నుంచి ఎన్ఎస్ఎస్ విద్యార్థి డేవిడ్ తమిళనాడు మధురైలో ఈ నెల 11 నుంచి 17 వరకు జరిగే జాతీయ సమైక్యత క్యాంపునకు ఎంపికైయ్యాడు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

**రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక..**

బెజ్జంకి, డిసెంబర్ 5: మండలంలోని తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుధగోని జాగృతి ఇటీవల జరిగిన డిస్కస్ త్రోలో జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో విద్యార్థినిని సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆకుపచ్చ సిద్దిపేటకు సర్వం సిద్ధం



మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

సిద్దిపేట, డిసెంబర్ 5 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆదేశాల మేరకు 2024 -25లో హరితహారంలో భాగంగా రంగనాయక సాగర్ వద్ద నర్సరీలో నాటిన 1,51,000 మొక్కలను మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, హరితహారం అధికారి సామల ఐలయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోగన్ విల్ (తెలుపు, ఆకుపచ్చ, గులాబీ, పసుపు రంగు), అకాలిఫా(ఆకుపచ్చ, పసుపు పచ్చ), మహాగని, స్పతోడియా, బహోనియా వంటి పలు రకాల మొక్కలను హరితహారం కోసం సిద్ధం చేశామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిల్ సభ్యులు, సిద్దిపేట పట్టణ ప్రజల సహకారంతో ఇప్పటికే పట్టణంలో పచ్చదనం పెంపొందించామన్నారు.